# ఓటుతో గెలిచిన వారంతా గొప్ప వారేమీ కాదు

> ప్రజల ఓట్లతో ఎన్నికల్లో గెలిచిన వారందరూ మంచివారు,ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకొని వాటిని పరిష్కరించి సమాజ విశాల హితం కోసం పని చేసేవారు, గొప్పవారు అని చెప్పలేము. అలాగని గెలిచిన వారంతా చెడ్డవారు కూడా ఏమీ కాదు. గెలిచిన వారిలో చాలా వరకు మంచి వారే ఉండవచ్చును,ఉన్నారు. రాచరిక వ్యవస్థల్లోని రాజులు, చక్రవర్తుల్లో అత్యధికులు క్రూరులు, హింసను ప్రేమించే వారు, ఆధిపత్యం వాదులే ఉండేవారు. రాజుల్లో మంచివారు అతి తక్కువ.కానీ ప్రజాస్వామిక వ్యవస్థల్లో అలాంటి వారికి చోటు ఉండకూడదు కదా. అలాంటి వారికి పాలనావకాశం దక్కని విధంగా పటిష్టమైన వ్యవస్థలు ఉండాలి. వ్యక్తుల ఏకపక్ష నిర్ణయాలకు వీలు లేకుండా సమిష్టి, ఉమ్మడి నిర్ణయాలను మాత్రమే అమలు చేయగల అవకాశాలు ప్రజా ప్రభుత్వాల్లో ఉండడం అవసరం.

కానీ దుర్మార్గులు, మూర్ఖులకు కూడా గద్దెలను అధిష్ఠించే అవకాశాలను కల్పించే లొసుగులు ఉన్నాయి. కొన్ని అసాధారణ సామాజిక పరిస్థితులు అనర్హులను కూడా ఎన్నికల్లో గెలిపిస్తాయి.గెలిపించాయి.

కొన్ని సామాజిక సందర్భాలు,వ్యవస్థల వైఫల్యాలు, వాటిలోని కొన్ని లోపాలు అనర్హులుకు కూడా అధికారం చలాయించే అవకాశాలుగా మారిపోతూ ఉంటాయి. కొన్ని అంశాలపై సమాజంలో తలెత్తిన అసంతృప్తి,అయిష్టం,కోపం,ద్వేషం అసమర్థులు, అవకాశ వాదులకు అవకాశంగా మారిపోవచ్చును. దుర్మార్గులు వాటిని అవకాశాలుగా మలచుకోవచ్చును. అలా కొన్ని సమాజాలు కొన్ని సందర్భాల్లో దుర్మార్గులు,మూర్ఖులు,అహంకారులకు గద్దెలను అధిష్టించే అవకాశాలను కల్పిస్తాయి,కల్పించాయి కూడా.

ఆధునిక రాజ్య వ్యవస్థలను ఎన్నుకునే ప్రజాస్వామ్య మూల ప్రక్రియ అయిన ఎన్నికల సందర్భాల్లో అనేక పరిస్థితులు ఓటరును పలు రకాలుగా ప్రభావితం చేస్తుంటాయి. సరైన ప్రత్యామ్నాయం కనిపించక పోటీలో ఉన్న వారిలో ఒక వైపునకు జనం మొగ్గు చూపవచ్చు. అలా అటువైపు దుర్మార్గుడు, మూర్ఖుడు మంచితనం అనే ముసుగులో ఉండవచ్చును.దానిని గ్రహించగల శక్తి, నేర్పు అప్పుడు ఆ సమాజానికి ఉండకపోవచ్చును. అలా ఆ పరిస్థితుల్లో అవగాహనాలేమి,చైతన్య రాహిత్యం, విచక్షణలేమి,కొన్ని ఉద్వేగాలు ఎన్నికల్లో గెలుపుఓటములను బాగా ప్రభావితం చేయవచ్చును. ఆధునిక సాంకేతిక ప్రచార మాయా ప్రభావంలో నిజం ఏమిటో తెలుసుకునే అవకాశాలు లేని కారణంగా తప్పుడు వ్యక్తులు అసాంఘిక శక్తులు అధికారంలోకి రావచ్చును. అలాంటి స్థితిలో మంచితనం ముసుగు వేసుకున్న దుర్మార్గుడు, మూర్ఖుడు,అహంకారి, నియంత ఏలికగా ఎన్నిక కావచ్చును.అలా గెలిచిన వారు గద్దె నెక్కిన తరువాత ముసుగు తీసేసి తమ అసలైన క్రూర స్వరూపాన్ని, స్వభావాన్ని ప్రదర్శించవచ్చును.అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకోవచ్చును. అలాంటి నిర్ణయాలు సమాజంలోని అత్యధికులైన సామాన్యులను విపరీతంగా వేధించవచ్చును. చరిత్రలో ఇలాంటి ఉదాహరణలు కొన్ని ఉన్నాయి. గత సంవత్సరం అమెరికా సమాజం అలాంటిదే ఒక పొరపాటు నిర్ణయమే తీసుకుందని తరువాతి కాలంలో బోధపడింది. ఆ ఎన్నికల్లో అలా ఒక అనర్హుడిని గద్దెపై కూర్చో బెట్టుకుంది. యేడాది కాలంగా ఆయన తీసుకున్న, తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికాతో పాటు దాదాపు మొత్తం ప్రపంచాన్ని అత్యంత గడ్డు స్థితిలోకి నెట్టివేసాయి. అలా ఆయన తీసుకున్న నిర్ణయాల్లో ఇరాన్ పై ఇజ్రాయిల్ తో కలిసి 55 రోజులుగా చేస్తున్న యుద్ధం కీలకమైనది. ఆ యుద్ధంపై అమెరికా సమాజంలో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ దేశవ్యాప్తంగా వేలాది పట్టణాలు,వందలాది నగరాల్లో భారీ నిరసన ప్రదర్శనలు,ఆందోళనలు జరిగాయి. "నో కింగ్స్" అనే నినాదంతో భారీ నిరసనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ యుద్ధ నిర్ణయం అనుచితమైనదనేది ఆ నిరసనలు, ప్రదర్శనల స్థూల సారాంశం.

కానీ ప్రజల నిరసనలను ఆయన ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. యుద్ధాన్ని అలాగే మొండిగా కొనసాగిస్తున్నారు. ప్రజల మనోగతాన్ని గౌరవించలేని వ్యక్తి అత్యంత గొప్ప ప్రజాస్వామ్యంగా ప్రచారం పొందిన అమెరికాకు అధ్యక్షుడిగా కొనసాగడమే గుతుండడమే ఇక్కడి సందర్భం. అమెరికాలో ఇప్పుడున్నది రాచరిక వ్యవస్థ కాదు. 250 యేళ్ళ క్రితం ఊపిరి పోసుకున్న అధ్యక్ష తరహా ప్రజాస్వామ్య వ్యవస్థ అది. ప్రపంచంలోనే అత్యంత స్వేచ్ఛా సమాజంగా అమెరికా ప్రచారం పొందింది. ఆ దేశ జాతీయ పతాకాన్ని సైతం దగ్ధం చేయగల స్వేచ్ఛ అమెరికన్ పౌరుడి సొంతం. అలాంటి అత్యంత స్వేచ్ఛా సమాజం



పాలకుడిగా పచ్చి నియంత పోకడలున్న వ్యక్తి ఎన్నికవడం ఒక వింత. పూటకో మాట మాట్లాడే ఆ మూర్ఖ, వాచాలుడు చిత్రాతి చిత్రమైన అనేక నిర్ణయాలను తీసుకున్నాడు. అమెరికా సమాజ మనోగతానికి వ్యతిరేకంగా ఇరాన్ పై జరుగుతున్న యుద్ధ ఫలితంగా ఇంధన ధరలను అధ్యక్షుల వారు ఇటీవల రెట్టింపు చేసి పారేశారు. యుద్ధ ఖర్చులను భర్తీ చేసుకునేందుకు ఇంధన ధరల పెంపు నిర్ణయం అనే ఒక వాదన అక్కడ ఉంది. ఇంధన(పెట్రోలు,డీజిల్) ధరల పెంపు అమెరికా సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. ఇరాన్ పై కొనసాగుతున్న యుద్ధం ఫలితంగా అనేక దేశాలకు ఇంధన సరఫరా స్తంభించి పోయింది. ఇరాన్ ప్రాదేశిక జలాల్లో ఉన్న హర్మూజ్ జలసంధిని స్తంభించి పోవడం దీనికి కారణం. దీంతో అనేక దేశాల్లోపెట్రోలు,డీజిల్,వంటగ్యాస్ లాంటి కీలక ఇంధనాలకు భారీ కొరత ఏర్పడింది. ఈ పరిస్థితిని అర్థం చేసుకుంటే అమెరికా ప్రజలు నిన్నటి ఎన్నికల్లో ఆ దేశ చరిత్రలోనే పొరపాటు నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం, నిర్ధారణలు, విశ్లేషణలు వ్యక్తమౌతున్నాయి.ఆయన తాజాగా ఇండియాను ఉద్దేశించి ఒక కారు కూతను కూసాడు. ఇండియాను ఒక నరక కూపం(హెల్ హోల్)గా

వర్ణించారు. అమెరికాకు ఉపాధి కోసం వెళ్లిన ఇండియా విద్యాధిక యువతను కూడా అత్యంత దారుణంగా అవమానించాడాయన. ఈ అహంకార పూరిత వాచాలతకు ఇండియా ఏలిక ఎందుకో నోరు మెదప లేదు. ఒక స్వతంత్ర దేశంపై ఇంతగా అవమాన పూరిత వ్యాఖ్యలు చేసినా స్పందించక పోవడం ఏమిటో!

140 కోట్ల జనాభాతో అపారమైన సహజ వనరులతో, విశాల భూభాగం కలిగి సర్వ సత్తాక సార్వభౌమ దేశ పాలకుడు స్పందించక పోవడం ఆశ్చర్యం కలిగించేదే కదా. అమెరికాకు ఇండియా సామంత రాజ్యం అయితే కాదు .ఇండియా అనే దేశం అమెరికాకు వలస దేశం కూడా కాదు. బ్రిటిష్ వలస పాలన నుంచి ఇండియా విముక్తి పొంది 80 యేళ్ళు గడిచి పోయాయి.నాటి నుంచి ఇప్పటి వరకు సర్వ సత్తాక, స్వతంత్ర సార్వ భౌమ దేశంగానే కొనసాగుతున్నది. వర్ధమాన దేశమే అయినా తన స్వతంత్రాన్ని, ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకొని అత్యంత గౌరవనీయ దేశంగా గౌరవ మర్యాదలను పొందుతున్నది.

ఇలాంటి దేశం మరో దేశ అధ్యక్షుడు ట్రంప్ వాగుడుకు సరైన జవాబు ఇచ్చి తీరాలి కదా. జవాబు ఎందుకు ఇవ్వలేదేమిటి? ఇది లొంగుబాటు అని అనుకోవాలా?ఆత్మ గౌరవ లేమి అని భావించాలా ?

వెన్నెముక లేని దిగజారి పోయిన నాయకత్వం తీరుకు నిదర్శనం అని అనుకోవాలా? ట్రంప్ నోటి దురుసు కొత్తదేమీ కాదు. ఆయన ఇంతకు ముందు కూడా ఇలాగే అనేక సార్లు వాగాడు.అనేక మార్లు ఇండియాపై నోరు పారేసుకున్నాడు.ఇండియాను "డెడ్ ఏకానమీ"అని నిందించాడు. అవమానించాడు. పెహెల్గాం(కాశ్మీర్) లో తీవ్రవాద దాడి జరగడం దాడిలో 26మంది అమాయకులు అన్యాయంగా మరణించడం తెలిసిందే. ఈ టెర్రర్ దాడికి ప్రతిగా పాకిస్తాన్ పై ఇండియా చేసిన "ఆపరేషన్ సిందూర్" ను తానే నిలిపివేశానని,తనను బతిమిలాడితేనే అది అణుయుద్ధంగా మారిపోకుండా నిలిపి వేశానని చెబుతూ వందమార్లు నోరు పారేసుకున్నాడు ట్రంప్. ఆ వాగుడుపై ఇండియా ఇప్పటి వరకు సరైన జవాబు చెప్పలేదు. గత శతాబ్దంలో ప్రపంచం పాలిట ఒక పీడకలలా మిగిలిపోయిన రెండవ ప్రపంచ యుద్ధ నేపథ్యం కూడా ఇలాంటి ఒక దుర్మార్గుడి ఆధిపత్య కాంక్ష ఫలితమే. ఆ యుద్ధానికి ప్రధాన కారకుడైన అడాల్ఫ్ హిట్లర్ కూడా ప్రజల మద్దతు,ఓట్లతో ఎన్నికల్లో గెలిచిన వాడే. నాడు ఆ దేశ ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టి వారిని మాయలో ముంచివేసి ఎన్నికల్లో వారి మద్దతును కూడగట్టి జర్మనీ గద్దెపైకి చేరుకున్నాడాయన. ఆ యుద్ధంలో ఆయన సృష్టించిన మారణ హోమ ఫలితాలను ప్రపంచమంతా అనుభవించింది.ఆయన ఆధిపత్య కాంక్ష, దేశ విస్తరణ, దురాక్రమణ ఆశ మొత్తం ప్రపంచాన్ని యుద్ధభూమిగా మార్చివేసింది.ఆధునిక ప్రపంచంలో అదొక అంతులేని రక్త చరిత్ర.

జర్మనీ ప్రజల ఓట్లతో గెలిచి రెండో ప్రపంచ యుద్దానికి కారకుడై ప్రత్యక్ష,పరోక్ష కారణాలతో అన్యాయంగా కోటి మందికి పైగా ప్రాణాలను అన్యాయంగా బలి తీసుకున్న అడాల్ఫ్ హిట్లర్ రాజు ఏమీ కాదు.

ఎన్నికల వ్యవస్థ ద్వారా గద్దెపైకి చేరిన వాడే. ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియ ద్వారా

ప్రజల ఓట్లతో ఎన్నికయ్యాడు కాబట్టి హిట్లర్ గొప్పవాడు,మంచివాడు అని పిలుద్దామా?

అలా ఎన్నికల్లో గెలిచి కోట్లాది మంది ప్రజలను వేధిస్తున్న నేతలు ఇంకా కొందరున్నారు.

"ధర్మం" ప్రమాదంలో పడి పోయిందని దానిని రక్షించుకోవడం అందరి కర్తవ్యం అనే ఒక మాయా సెంటిమెంట్ ను సృష్టించి, రగిలించి కోట్లాది మంది అమాయక ప్రజలను ఆ భ్రమల్లో ముంచివేసి వారి ఓట్ల మద్దతుతో గద్దెనెక్కి సామాన్య జనాన్ని జలగలాగా పీడిస్తున్న "నాయకుడి"ని ఇప్పుడు చూస్తూనే ఉన్నాం.జనాల అసలు సమస్యలను పక్కన బెట్టి వ్యక్తిగత స్థాయిలో మాత్రమే ఉండవలసిన ధర్మం,విశ్వాసం లాంటి ఉద్వేగాలపై మాత్రమే ఆయన ఆయన పరివారం చేస్తున్న క్షుద్ర రాజకీయాలను చూస్తూనే ఉన్నాం. వెలుపలికి ఐక్యత అనే చిలక పలుకులు పలుకుతూ ఫక్తు సామాజిక విభజనను సృష్టించి మనుషుల మధ్య కృత్రిమ గోడలను కడుతూ ఆ పునాదిపైనే రాజకీయాలు చేస్తున్న తీరును చూస్తున్నాం. దేశంలోని ఒక ప్రాంతంలో రెండు వర్గాల మధ్య నెలల తరబడి అంతర్యుద్ధం జరిగినా నోరు మెదపని ఈయన గారిని మొత్తం దేశానికి ప్రాతినిధ్యం వహించే నేతాశ్రీ అని ఎలా పిలవాలి ?

ఆడజాతి భుజంపై తుపాకీ పెట్టి ప్రతిపక్షాన్ని దేశ రాజకీయ వ్యవస్థను సమూలంగా దెబ్బకొట్టే యత్నం చేసి విఫలమై పోయిన తంతును కూడా నిన్ననే మనం చూశాం. పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఇలా ముసుగు దారిలో ఎన్నికైపోయి అసలైన ప్రజా సేవక కర్తవ్యాన్ని పక్కన బెట్టినా ఏమీ చేయలేని నిస్సహాయ వ్యవస్థగా మిగిలిపోవడం పార్లమెంటరీ వ్యవస్థలో ఉన్న లోపమేమో అనిపిస్తున్నది. ఈ సమాజ చైతన్య రాహిత్యం వల్లనే ప్రజాస్వామ్యం అనే ముసుగులో ఇలాంటి "ధర్మ" రాజకీయాలు కొనసాగగలుగుతున్నాయి. జనం ఓట్లతో గెలిచి వారినే పీడిస్తున్న తీరు రాచరిక వ్యవస్థలోని రాచరికం నాటి రాజు,చక్రవర్తి పాలనలను గుర్తు చేస్తున్నది.రాచరికాల్లో మాత్రమే చెల్లుబాటయ్యే అహంకారం? ఆధిపత్యం?ప్రజాస్వామిక వ్యవస్థల్లో కూడా కొనసాగడం ఏమిటి?ఈ వ్యవస్థల్లో ఇవి పెద్ద లోపాలుగానే కనిపిస్తున్నాయి. వీటిని సరిదిద్దవలసిన అనివార్య స్థితి అయితే కనిపిస్తున్నది.ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో అంతులేని అధికారాలను చలాయించగల అధికారం అధ్యక్ష కుర్చీ కలిగిఉండడం అమెరికా ప్రజాస్వామ్యంలో పెద్ద లోపంగానే కనపడుతున్నది. వికేంద్రీకృత అధికారం ఉండవలసిన ఆధునిక రాజ్య వ్యవస్థలో ఇది ఒక వికృతి. వీటిని సరిదిద్దుకోగలిగితే తప్ప ఈ ప్రపంచం నాగరికంగా ,ఆధునికంగా రూపుదిద్దుకోదు.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# చికిత్స కంటే వ్యాధి నివారణ ముఖ్యం

## నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25 న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రాణాంతక వ్యాధి మలేరియా అనే పట్ల ప్రజలలో అవగాహన పెంచడం, చికిత్స చేయడం, నివారించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం ప్రపంచ మలేరియా దినోత్సవం ఉద్దేశం.5వేల సంవత్సరాల క్రితం నుండే మలేరియా మానవజాతిని పట్టి పీడిస్తున్నదని తేలింది. క్రీస్తు పూర్వం 2700 మొదలుకుని చైనాలో చాలాసార్లు మలేరియా లాంటి జ్వరాలు వచ్చినట్లు ఆధారాలు ఉన్నాయి. మలేరియా అనే పేరు "మల అరియ" అనే ఇటాలియను పదాల నుండి పుట్టింది. "మల అరియ" అంటే చెడిపోయిన గాలి అని అర్థం. చిత్తడి నేల ఉన్న చోట్ల మలేరియా అధికంగా ఉండటం వలన ఈ జ్వరాన్ని చిత్తడి జ్వరం అని కూడా పిలిచేవారు.1880లో ఫ్రెంచి సైన్యంలో వైద్యుడైన చార్లెస్ లూయీ ఆల్ఫోన్సె లావెరెన్ అల్జీరియాలో పనిచేస్తున్నప్పుడు ఎర్రరక్త కణాలలో ఈ పరాన్న జీవులను కనుగొన్నాడు. ఈ పరాన్న జీవులే మలేరియా కారకాలని మొట్ట మొదటిసారిగా ప్రపంచానికి చాటి చెప్పాడు. దీని వలన, తరువాత కనుక్కున్న ఇంకొన్ని విశేషాల వలన ఆయనకు 1907లో నోబెల్ బహుమతి లభించింది. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త సికింద్రాబాదు నగరంలో పరిశోధన చేస్తున్నప్పుడు 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. తద్వారా ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. మలేరియా పరాన్న జీవికి ప్లాస్మోడియం అని పేరు పెట్టారు.మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన కలుగుతుంది. మనుషుల్లో ఆడ అనోఫిలస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పరాన్నజీవిని కలిగివున్న దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ప్రపంచంలో ఏటా 500 మిలియన్ల జనాభా మలేరియా జ్వరాల బారిన పడి వారిలో 2.7 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్లాస్మోడియం" అనే ప్రొటోజోవా పరాన్నజీవి మలేరియా వ్యాధి కారకము. ప్రోటోజోవాలు ఏకకణజీవులు. వీటి నిర్మాణము బ్యాక్టీరియా కంటే క్లిష్టమైనది. బ్యాక్టీరియా చాలా సులువయిన నిర్మాణము కలిగి ఉంటాయి. వివిధ ప్లాస్మోడియం స్పీసీస్లు మనుషులలో వివిధ రకాల మలేరియాలను కలుగజేస్తాయి. అందులో ...ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరియై, ప్లాస్మోడియం ఒవేల్, ప్లాస్మోడియం సెమీ ఒవేల్, ప్లాస్మోడియం నోవెస్లి ముఖ్యమైనవి.దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులతో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్నజీవులు విభజన చెంది చిట్లిపోతాయి. దీనివలన ఫ్లూ, వణుకుతో కూడిన జ్వరం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘ శ్వాస, రక్తలేమి చిహ్నాలు మరియు స్పృహ కోల్పోవడం జరుగుతుంది.చలి జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పిగా




ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, వాంతులు, విరేచనాలు, నీరసంగా ఉండటం, ఆయాసం మొదలైనవి మలేరియా లక్షణాలు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించవచ్చు. దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయి. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కోపిక్ ల్యాబోరేటరీ టెస్టులు లేదా ఆర్డీటీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారు.1946నుండి మలేరియా అదుపు చేయడానికి డి.డి.టి వినియోగం మొదలయ్యింది. 1953లో 7 కోట్ల పైగా ప్రజలు మలేరియా బారిన పడ్డారు. 8 లక్షల వరకు మరణాలు అందువలన సంభవించాయి. అప్పుడు 1958లో జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్లు రక్తపరీక్ష చేసి మలేరియా అని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుండి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గీంసా ద్రావకం వేస్తారు. దీనివలన డాక్టర్లు సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కింద మలేరియా జీవులను చూడ గలుగుతారు. మలేరియా బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే.. వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలు. దోమలు ఉండకుండా చూసుకోవాలి. ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మస్కిటో రిపెల్లెంట్స్ క్రీములు, స్ప్రేలు వాడటం ఉపకరిస్తుంది. ఘాటైన వాసనలను వెదజల్లే మొక్కలు, పుష్పాలను దోమలు ఇష్టపడవు. కాబట్టి బంతి రోస్‌మేరీ, పుదీనా మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచడం వల్ల దోమలు రాకుండా ఉంటాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవడం ముఖ్యం. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమై, రోగాల బారిన పడకుండా ఉంటాం. వీధుల్లో అమ్మే అపరిశుభ్ర ఆహారం తీసుకోవడం మానేయాలి.అధిక ప్రొటీన్లు ఉన్న పాలు పెరుగు, మజ్జిగ మలేరియా వ్యాధి ఉన్న వారు కణజాలాన్ని అధికంగా కోల్పోవడం వలన మలేరియా ఉన్నవారు తమ ఆహార ప్రణాళికలో ప్రొటీన్లను చేర్చుకోవాలి. అధిక ప్రోటీన్ మరియు అధిక చెక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు కణజాల నిర్మాణానికి దోహద పడతాయి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, లస్సీ, చికెన్ సూప్, గుడ్లు మొదలైనవి తీసుకోవాలి.ఎలాక్ట్రోలైట్స్ మరియు నీటిని కోల్పోవడం మలేరియా వ్యాధి ఉన్నవారిలో సర్వ సామాన్యం. కనుక పండ్ల రసాలు, సూపులు, గంజి, కొబ్బరి నీరు, పప్పు నీరు మొదలైనవి తీసుకోవడం శ్రేయస్కరం. బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్ల విటమిన్ ఎ, విటమిన్ సి సమృద్ధిగా కలిగిన బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్లయిన నారింజ, బత్తాయి, ద్రాక్ష, అనాస పనస, నిమ్మ మొదలైన ఆహార పదార్థాలతో పాటు బి కాంప్లెక్స్ విటమిన్లు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.




- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# రేడియో ఆవిష్కర్త మార్కోనీ

## నేడు ఆయన జయంతి

గుగ్లి ఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ ఇటాలియన్ ఆవిష్కర్త, ఎలక్ట్రికల్ ఇంజనీర్. అతను సుదూర ప్రాంతాలకు రేడియో ప్రసారాలు పంపుటకు, రేడియో టెలిగ్రాఫ్ వ్యవస్థను అభివృద్ధి చేయుటలో పితామహుడుగా గుర్తింపు పొందాడు. అతను రేడియో యొక్క ఆవిష్కర్త. 1909 లో కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్ తో కలసి వైర్‌లెస్ టెలిగ్రాఫీ అనే అంశంపై భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి తీసుకున్నాడు. 1897 లో బ్రిటన్ లో వైర్‌లెస్ టెలిగ్రాఫ్, సిగ్నల్ కంపెనీకి వ్యవస్థాపకునిగా ఉన్నాడు. అతను ఇతర భౌతిక శాస్త్రవేత్తల ప్రయోగాలను ఆధారంగా చేసుకొని రేడియో అనే కొత్త ఆవిష్కరణ చేసి వ్యాపార రంగంలో ఘనమైన విజయాన్ని సాధించాడు.రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. మార్కోని 1874 ఏప్రిల్ 25 లో ఇటలీ దేశంలోని బొలొగ్నాలో అన్నీ జేమ్‌సన్, గుసెప్ మార్కోనీ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలో మార్కోనీ పరిశోధనల పట్ల మక్కువ చూపించేవాడు. తన తల్లిదండ్రులచే నియమించబడిన ప్రైవేట్ ఉపాధ్యాయుల నుండి ఇంట్లో రసాయనశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలను నేర్చుకున్నాడు.లివోర్నోలోని ఉన్నత పాఠశాల భౌతిక ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ విన్సెంజో రోసా 17 ఏళ్ల మార్కోనీకి భౌతిక దృగ్విషయాల ప్రాథమిక విషయాలను, అలాగే విద్యుత్తుపై కొత్త సిద్ధాంతాలను నేర్పించాడు.18 యేళ్ళ వయస్సులో అతను తిగిరి బోలోగ్నాకు తిరిగి వచ్చాడు.1890 ల ప్రారంభంలో, అతను "వైర్‌లెస్ టెలిగ్రాఫీ" అనే ఆలోచనపై పనిచేయడం ప్రారంభించాడు, అంటే ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ ఉపయోగించిన వైర్లను కనెక్ట్ చేయకుండా టెలిగ్రాఫ్ సందేశాలను ప్రసారం చేయడం. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. 1888 లో, విద్యుదయస్కాంత వికిరణాన్ని ఉత్పత్తి చేయగలవచ్చునని, గుర్తించగలమని నిరూపించాడు.ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో



ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా SOS సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలోకెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి.1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి.సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది.బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.